క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఏకాహం

తాళ్లరేవు: మండలంలోని జార్జిపేట గ్రామ పంచాయతీలోని గోపాల్ గార్డెన్స్‌లో ఏకాహ మహోత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన గుత్తుల బాలకృష్ణ ఆధ్వర్యంలో కాశీకృష్ణ భగవాన్ భక్త బృందంచే భజన కార్యక్రమం, అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, ప్రజా కళల ప్రోత్సాహక వేదిక ట్రస్ట్ అధినేత డా.పుల్లెపు వెంకటేశ్వరరావు, దంగేటి ఏడుకొండలు, సలాది సత్యకృష్ణ, శివల సిద్ధయ్య, ఎల్.వెంకట రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగా పోటీలు



పోటీల్లో విజేతలతో ఏఆర్ ఆర్ఐ సీతారామ్, యోగా గురువు డాక్టర్ శ్రీనివాస్

అమలాపురం టౌన్: స్వామి వివేకానంద యోగాశ్రమం ఆధ్వర్యంలో స్థానిక లూయిా అంధుల పాఠశాల విద్యార్థులకు గత మూడు నెలలుగా శిక్షణా తరగతులు జరుగుతున్నాయి. గురువారం శిక్షణా తరగతుల ముగింపు సందర్భంగా అంధ విద్యార్థులకు యోగాశ్రమ గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ ఐదు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు ఏఆర్ పోలీస్ విభాగం ఆర్ఐ సీతారామ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. యోగాశ్రమ గురువు డాక్టర్ శ్రీనివాస్ సేవలను ఏఆర్ ఆర్ఐ సీతారామ్ కొనియాడారు. కార్యక్రమంలో లూయిా అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ రామాయణం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పుత్సా కృష్ణ కామేశ్వర్ కృషి అభినందనీయం



కృష్ణ కామేశ్వర్‌ను అభినందిస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్

అమలాపురం టౌన్: తపాలా బిళ్లల సేకరణలో అమలాపురానికి చెందిన సేకరణకర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ కృషి అభినందనీయమని పోస్టల్ సూపరింటెండెంట్ చిట్టూరి శ్రీనివాస్ అన్నారు. తపాలా బిళ్లల సేకరణ ద్వారా ఇటీవల లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను కైవసం చేసుకున్న కృష్ణ కామేశ్వర్‌ను స్థానిక అమలాపురం డివిజన్ తపాలా ప్రధాన కార్యాలయంలో గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బీహార్‌కు చెందిన కాళీ ప్రసాద్ 78 తపాలా బిళ్లలు సేకరించి గతంలో నెలకొల్పిన రికార్డ్‌ను కృష్ణ కామేశ్వర్ 216 బిళ్లల సేకరణతో అధిగమించి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను సొంతం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ విశ్వేశ్వరరావు, పోస్ట్‌మాస్టర్ ఏకాంబరం, పోస్టల్ సిబ్బంది అమర్‌నాథ్, టి.రవికృష్ణ, రమణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మై ఓట్ మై డ్యూటీ ర్యాలీ



ఎన్ఎస్ఎస్ వలంటీర్లచే మై ఓట్ మై డ్యూటీ ర్యాలీ

యానాం: సాధారణ ఎన్నికల నేపథ్యంలో పౌరుడు తనకున్న ఓటు హక్కును వినియోగించడం బాధ్యతగా తీసుకోవాలని కోరుతూ గురువారం స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 విభాగాల వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్ఏఓ ఆఫీసు నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణ వీధుల్లో సాగింది. ఈ సందర్భంగా ప్రజాస్వామ్యంలో పౌరులు తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పదో తరగతి పరీక్షలు



కామనగరువులో పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

అమలాపురం రూరల్: ఈ నెల 18వ తేదీన ప్రారంభమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు గురువారంతో ప్రశాంతంగా ముగియని ఎంఈవో గుబ్బల సూర్యప్రకాష్ అన్నారు. అమలాపురం పట్టణ, రూరల్ మండలంలోని పరీక్ష కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం జరిగిన సంస్కృత పరీక్షకు 406 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా 404 మంది రాశారన్నారు. పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించిన అధికారులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యం

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పొన్నాడ
- అడుగడుగునా ప్రజల బ్రహ్మరథం

ముమ్మిడివరం: సంక్షేమ పాలన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ముమ్మిడివరం వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కొత్తలంక, మర్లపాలెం, కర్రివానిరేవు పంచాయతీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో గురువారం ఆయన విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు, వృద్ధులు, యువత ఆయనకు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. వందలాది మంది వైఎస్సార్ సీపీ శ్రేణులు వెంట రాగా పొన్నాడ ఎన్నికల ప్రచార రథంపై నుంచి ఓటర్లకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. పలు కూడళ్లలో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల వల్ల ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.



కొత్తలంకలో బట్టలు ఇస్త్రీ చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తూ..

ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తూ కొత్తలంకలో ఇంటింటి ప్రచారం చేస్తున్న సమయంలో ఓ రజకుడి ఇంటికి వెళ్లి ఇస్త్రీ పెట్టె తీసుకుని బట్టలు ఇస్త్రీ చేసి ఫ్యాను గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. పేదల కష్టం తెలిసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శంకరరావు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, సర్పంచ్‌లు గుత్తుల కల్యాణి, విత్తనాల నాగ బ్రహ్మేశ్వరరావు, కాశి భాగ్యలక్ష్మి, నాయకులు కాశి జగపతిరావు, చింతా నాగమునీంద్రరావు, జంగా రెడ్డి రమేష్, గొర్రెల వాసు, కాశి వెంకట రమణ, రచ్చా ప్రకాష్, రెడ్డి శివన్నారాయణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, ఢిల్లీ నారాయణ, కాశి బాలమునికుమారి, కోలా బాబ్జి, నల్లా నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



కొత్తలంకలో సర్పంచ్ గుత్తుల కల్యాణితో స్కూటీపై వెళుతూ ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ



కర్రివానిరేవులో ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ

వచ్చే నెల 5న తపాలా అదాలత్

అమలాపురం టౌన్: తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యల పరిష్కారం కోసం వచ్చే నెల 5వ తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో తపాలా అదాలత్ జరుగుతుందని సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. తపాలా సర్వీసులకు సంబంధించి ప్రత్యేక, వ్యక్తిగత ఫిర్యాదులు మాత్రమే ఈ అదాలత్‌లో చర్చిస్తామన్నారు. వినియోగదారులు తమ సమస్యలు, ఫిర్యాదులను ఈ నెల 30వ తేదీలోగా 'తపాలా అదాలత్' అనే శీర్షికతో సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్, అమలాపురం డివిజన్, అమలాపురం 533201 అనే చిరునామాకు పంపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదుదారులు వ్యక్తిగతంగానూ అదాలత్‌కు హాజరు కావచ్చని తెలిపారు.

సదస్సు విజయవంతం చేయాలి

అమలాపురం రూరల్: ఈ నెల 30వ తేదీన గుంటూరులో జరిగే రాష్ట్ర ఎమ్మార్పీఎస్ విస్తృత స్థాయి కార్యకర్తల సదస్సును విజయవంతం చేయాలని జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి మాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లూటుకుర్తి చిన్నలు పిలుపునిచ్చారు. మండలంలోని రోళ్లపాలెంలో నేదునూరి నతానియేలు ఇంటి వద్ద ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం గురువారం జరిగింది. కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ ఆకుమర్తి రమేష్ మాదిగ, సత్తాల దుర్గారావు, పలివెల రాంబాబు పాల్గొన్నారు.

వరి చేలను పరిశీలించిన ఉన్నతాధికారులు

తాళ్లరేవు: మండల పరిధిలోని పి.మల్లవరం పంచాయతీ శివారు గ్రాంటు గ్రామంలో ఎండిపోతున్న వరి పొలాలను ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ సతీష్ కుమార్, ఎస్ఈ జి.శ్రీనివాస్, కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావులు పరిశీలించారు. స్థానికంగా నెలకొన్న సాగునీటి సమస్యపై ఆందోళన చేస్తున్న రైతులతో వారు మాట్లాడారు. స్థానిక రైతు ప్రతినిధి ధూళిపూడి వెంకట రమణ తదితరులు మాట్లాడుతూ అధికారుల అనుమతితోనే రెండో పంట వేశామని, అయినా సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓఎన్జీసీ పైపులైన్ ద్వారా నీటిని సరఫరా చేసి, నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాకు చీఫ్ ఇంజినీర్ సతీష్‌కుమార్ ఫోన్‌లో సమస్యను వివరించారు. అనంతరం ఓఎన్జీసీ అధికారులతో మాట్లాడి పైపులైన్ ద్వారా నీటిని సరఫరా చేసేందుకు అంగీకరించినట్లు తెలిపారు. తక్షణమే నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని ఆర్డీఓ కిషోర్‌కు ఆదేశాలిచ్చారు. ఎవరైనా అక్రమంగా మోటార్ల ద్వారా నీటిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఈ రామకృష్ణ, డీఈ హిమరత్నం, ఏఈ ఈశ్వర్, రైతు సంఘాల నాయకులు వల్లు రాజబాబు, టి.ఈశ్వరరావు, ఉంగరాల వెంకటేశ్వరరావు, సింహాచలం, సత్యనారాయణ, సూరంపూడి శ్రీను, కృష్ణ, శివ, మహేష్, ఏడుకొండలు, మావుళ్లు, సూరిబాబు, నాగు తదితరులు పాల్గొన్నారు.



గ్రాంటు గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న కాకినాడ ఆర్డీఓ కిషోర్ తదితరులు



సాగునీటి సమస్యపై జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న ఇరిగేషన్ సీఈ సతీష్‌కుమార్

చౌహాన్‌కు సాదర స్వాగతం పలికిన ఆర్ఏఓ

యానాం: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించేందుకు విచ్చేసిన పుదుచ్చేరి ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ డాక్టర్ శరత్ చౌహాన్‌కు రాజమహేంద్రవరం విమానాశ్రయంలో ఆర్ఏఓ మునిస్వామి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అదేవిధంగా ఆర్ఏఓ కార్యాలయ సిబ్బంది, పలువురు అధికారులు సైతం ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం అక్కడ నుంచి ఆయన గాడిమొగ రిలయన్స్ సంస్థ అతిథి గృహానికి వెళ్లారు. శుక్ర, శనివారాలు రెండు రోజుల పాటు స్థానిక ఆర్ఏఓ ఆఫీసులో లోక్‌సభ ఎన్నిక ఏర్పాట్లపై సంబంధిత సిబ్బందితో సమావేశం కానున్నారు.



పుదుచ్చేరి చీఫ్ సెక్రటరీ చౌహాన్‌కు పుష్పగుచ్ఛం అందజేసిన ఆర్ఏఓ మునిస్వామి

వైఎస్సార్ సీపీలో జనసేన నాయకుడి చేరిక

ఉప్పలగుప్తం: మండలంలోని నంగవరం గ్రామ ఉప సర్పంచ్ పోతుల దొరబాబు జనసేనను వీడి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో గురువారం చేరారు. దొరబాబు గతంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో జనసేన మద్దతుదారుడిగా గెలుపొంది గ్రామంలో ఉపసర్పంచ్‌గా కొనసాగుతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో అమలాపురం నియోజకవర్గానికి జనసేన పార్టీ అభ్యర్థిని ప్రకటిస్తారని ఆశ పడినా ఆ సీటు టీడీపీకు త్యాగం చేయటంతో తాము పార్టీపై నమ్మకం కోల్పోయామన్నారు. సీఎం జగన్ సుస్థిరమైన పాలనను చూసి వైఎస్సార్ సీపీలో చేరుతున్నానని దొరబాబు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ ఉద్యానవన పాలక మండలి సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కార్యదర్శి శీలం సూరిబాబు పాల్గొన్నారు.



మంత్రి సమక్షంలో పార్టీలో చేరిన జనసేన నాయకుడు దొరబాబు

నేడు భట్నవెల్లిలో మంత్రి విశ్వరూప్ ప్రచారం

అమలాపురం రూరల్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ శుక్రవారం ఉదయం 8 గంటలకు భట్నవెల్లిలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారని మండల పార్టీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి గురువారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు కామనగరువు, పితానివారిపాలెం, అబ్బిరెడ్డి కాలనిలో ప్రచారం చేస్తారన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

నీటి సంరక్షణ ద్వారానే జీవకోటి ఉనికి

యానాం: నీటి సంరక్షణ ద్వారానే జీవకోటి ఉనికి ఆధారపడి ఉందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం గిరియాంపేట పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రపంచ జలదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానోపాధ్యాయుడు డి.త్రిమూర్తులు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకల ప్రాణులు జీవించేందుకు నీరే ఆధారమని, అలాంటి జలవనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. జాతీయంగా చూస్తే రాష్ట్రాల మధ్య నీటి కేటాయింపుల తగాదాలు తీవ్రంగా ఉంటున్నాయని, భూగర్భజలాలు తగ్గుతుండటమే దీనికి ప్రధాన కారణమన్నారు. నీటిని పొదుపుగా వాడటం, నీటి సంరక్షణ, అడవులు, చెట్లను కాపాడుకోవడం, తద్వారా భూతాపాన్ని తగ్గించడం వంటివి చేపట్టాల్సి ఉందన్నారు. ప్రస్తుతం బెంగుళూరు నగరంలో నీటి కొరత గురించి ఉదాహరణగా వివరించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయుడు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు

విశ్వశాంతి మహాయాగం




విలసవిల్లిలో గణపతి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి రామమందిరంలో పండితులు మున్నంగి రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో విశ్వశాంతి మహాయాగం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం మూడు రోజుల పాటు నిర్వహిస్తామని రామకృష్ణ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా మొదటి రోజు గణపతి పూజ, అనంతరం సిద్ధి బుద్ధి సమేత గణపతి దేవునికి కల్యాణం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

రూ.8 లక్షల ఆస్తి నష్టం

అమలాపురం రూరల్: మండలంలోని రోళ్లపాలెం గ్రామంలో గురువారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో ఒక పెద్ద తాటాకిల్లు దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించడంతో తాటాకింట్లోని రెండు పోర్షన్లలో నివాసముంటున్న ముషిణి నాగేశ్వరరావు, ముషిణి సత్యనారాయణల కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో బయటకు పరుగులు తీశారు. స్థానికులు అమలాపురం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. తాటాకింట్లో అద్దెకు ఉంటున్న సత్యనారాయణ దానికి ఎదురుగా సొంతిల్లు నిర్మించుకుంటున్నారు. ఇంటి పనుల కోసం తెచ్చుకున్న రూ.6 లక్షల నగదు, బంగారు అభరణాలు ప్రమాదంలో కాలిబూడిదయ్యాయని సత్యనారాయణ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ప్రమాదంలో మొత్తంగా రూ.8 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని అధికారులు అంచనా వేస్తున్నారు.



అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న తాటాకిల్లు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమలాపురం రూరల్: విద్యుత్ లైన్ల పునరుద్ధరణ, మరమ్మతుల నిమిత్తం అమలాపురం డివిజన్‌కు సంబంధించి 132/33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పట్టణంలోని చేపల మార్కెట్, గోల్డ్ మార్కెట్, ముమ్మిడివరం గేట్, దుడ్డివారి అగ్రహారం, సావరం, విద్యుత్ నగర్, గవర్నమెంట్ హాస్పటల్, నల్ల వంతెన, వంటెద్దువారి వీధి, తామరచెరువు, వానపల్లివారి వీధి, రవణం మల్లయ్య, నల్లవంతెన, మెట్లకాలనీ జనుపల్లి, ఎ.వేమవరంతో పాటు కామనగరువు, సమనస, వన్నెచింతలపూడి, భట్నవిల్లి తదితర గ్రామాల్లో విద్యుత్ నిలిచిపోతుందన్నారు.

గంటి పీఏసీఎస్ టర్నోవర్ రూ.4.83 కోట్లు

కొత్తపేట: మండలంలోని గంటి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) బిజినెస్ టర్నోవర్ రూ.4,83,43,000తో నడుస్తోందని సంఘం పర్సన్ ఇన్‌చార్జి మట్టపర్తి వెంకట్రావు తెలిపారు. గురువారం సంఘం సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. సమావేశంలో 2023 ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 29 వరకూ సంఘ ఆదాయ, వ్యయాలు, ఇతర అంశాలపై సమీక్షించి ఆమోదించారు. సంఘంలో సభ్యులకు రూ.5,68,34,000 అప్పులుగా ఇచ్చినట్టు, ప్రస్తుతం రూ.4,68,314 లాభంతో నడుస్తున్నట్టు వివరించారు. 2022–23 ఆడిట్ రిపోర్టు, 2023–24 సాలుసరి నివేదిక, 2024–25 అంచనా బడ్జెట్ ఆమోదించారు. ఈ సమావేశంలో సంఘ పర్సన్ పోలిమాటి అంజనీ కుమారి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఈస్టర్ నాటిక



నాటికలో ఏసుక్రీస్తును శిలువ వేసే సన్నివేశం



ఈస్టర్ నాటికలోని ఓ సన్నివేశం

యానాం: గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని గ్లోబల్ క్రిస్టియన్ ఎంపవర్‌మెంట్ అసోసియేషన్, రేస్ ఆఫ్ పీస్ చర్చి సంయుక్త నిర్వహణలో గురువారం రాత్రి స్థానిక యానాం నీలపల్లి సత్య థియేటర్ సమీపంలో ప్రదర్శించిన ఈస్టర్ నాటిక అందరినీ ఆకట్టుకుంది. రేస్ ఆఫ్ పీస్ చర్చి పాస్టర్ ఉషారాణి మూర్తిరాజు ఆధ్వర్యంలో భారీ సెట్టింగ్‌లతో, శ్రావ్యమైన సంగీతంతో 50 మంది కళాకారులతో వేసిన నాటిక అందరి చేత కన్నీళ్లు పెట్టించింది. యానాం పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో క్రైస్తవులు నాటిక చూసేందుకు తరలివచ్చారు.

30న అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ నియోజవర్గానికి ఈ నెల 19న జరగనున్న ఎన్నికల్లో పోటీ చేయడానికి మొత్తం 45 మంది తమ నామినేషన్లు దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి ఎ.కులోతుంగన్ గురువారం తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 20 నుంచి 27 వరకూ నామినేషన్లు స్వీకరించినట్లు తెలిపారు. 45 మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారన్నారు. వారిలో గుర్తింపు కలిగిన రాజకీయపార్టీలు, ఇండిపెండెంట్‌లు ఉన్నారన్నారు. నామినేషన్ల ఉపసంహరణ ఈ నెల 30న ఉంటుందన్నారు. అదే రోజు పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాతో పాటు వారికి కేటాయించిన గుర్తులను ప్రకటిస్తామన్నారు.

వచ్చే నెల 2 నుంచి బ్యాలెట్ ఓటింగ్

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి జరుగుతున్న ఎన్నిక నేపథ్యంలో 85 ఏళ్లు దాటిన వృద్ధులకు, దివ్యాంగులకు వచ్చే నెల 2 నుంచి బ్యాలెట్ ఓటింగ్‌ను నిర్వహించనున్నారు. నియోజకవర్గ పరిధిలో దివ్యాంగ ఓటర్లు 978 మంది ఉండగా, 85 ఏళ్లు దాటిన వృద్ధులు 597 మంది ఉన్నారు. ఈ నేపథ్యంలో గురువారం స్థానిక ఆర్ఏఓ ఆఫీసులో సెక్టార్ ఆఫీసర్లకు మాస్టర్ ట్రైనీలు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇప్పటికే ఆయా బీఎల్ఓలు ఫారం–డీని ఆయా వృద్ధులు, దివ్యాంగ ఓటర్లకు పంపిణీ చేశారు. వారి ఇళ్ల వద్దకు వెళ్లి బ్యాలెట్ ఓటు వేయించేలా ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో కూడిన ఐదు బృందాలను నియమించారు. ముఖ్యంగా వారిలో బ్యాంక్ ఉద్యోగి, నవోదయ ఉద్యోగి తదితర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉండనున్నారు. వీరంతా బ్యాలెట్ బాక్స్‌లతో ఆయా ఓటర్ల వద్దకు వెళ్లనున్నారు.

ఇద్దరు సాధారణ పరిశీలకుల నియామకం

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి వచ్చే నెల 19న జరగనున్న ఎన్నిక కోసం ఎన్నికల కమిషన్ పియూష్ సింఘాలా, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అమర్‌దీప్‌సింగ్ రాయ్‌లను జనరల్ అబ్జర్వర్లుగా నియమించింది. ఈ మేరకు పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గ మానిటరింగ్ కమిటీ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో పాటు ఆయా పార్టీల అభ్యర్థులు ఎన్నికల కోడ్ ఉల్లంఘించకుండా అబ్జర్వర్లు పరిశీలిస్తారని కమిటీ సభ్యులు వెల్లడించారు. నిబంధల ఉల్లంఘనపై 94861 72753, 98462 88092 సెల్ నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



సమావేశంలో మాట్లాడుతున్న మురళీకృష్ణ

మామిడికుదురు: రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ రెండో తేదీ నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఆరు మండలాల్లో పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ, కెరీర్ గైడెన్స్‌పై ఉచిత శిక్షణ ఏర్పాటు చేశామని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుత్తుల వీరబ్రహ్మం, కోనసీమ జిల్లా అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ తెలిపారు. గురువారం మామిడికుదురులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి పరీక్షలు రాసిన అన్ని సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులకు ఈ శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. శిక్షణ అనంతరం ఉచితంగా స్టడీ మెటీరియల్ కూడా అందజేస్తామన్నారు. రెండో తేదీ మధ్యాహ్నం రెండు నుంచి ఆరు గంటల వరకు ఈ శిక్షణ ఇస్తారని చెప్పారు. మామిడికుదురు, మలికిపురం, పి.గన్నవరం, అమలాపురం, కొత్తపేట, అలమూరు మండలాల్లో ఈ శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కా వెంకటేశ్వరరావు, జనరల్ సెక్రటరీ కె.సుబ్బరాజు పాల్గొన్నారు.

న్యాయవాద సంఘ కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

రాజోలు: రాజోలు న్యాయవాద సంఘ నూతన కార్యవర్గ ఎన్నికలు శుక్రవారం ఏకగ్రీవంగా జరిగాయి. న్యాయవాద సంఘ అధ్యక్షుడిగా మామిడిశెట్టి సాయిబాబు, ఉపాధ్యక్షుడిగా చింతా ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా గొల్లమందల స్టాలిన్, కోశాధికారిగా వీవీ నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శులుగా సిర్రా వెంకటేశ్వరరావు, గుబ్బల రజిత, కార్యవర్గ సభ్యులుగా బి.ప్రేమ్‌కుమార్, గర్నిపూడి సత్యనారాయణ ఎన్నికయ్యారు. సీనియర్ న్యాయవాది జాలెం భాస్కరరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అధ్యక్షుడు కోట సుధాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 2023–24 ఏడాదికి సంబంధించిన ఆదాయ, వ్యయ వివరాలను ప్రధాన కార్యదర్శి కొక్కిరగెడ్డ శేషగిరి వెల్లడించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి సీనియర్ న్యాయవాదులు వాడ్రేవు పాపయ్యపంతులు, పీవీ కృష్ణంరాజు, ఆకుల భాస్కరరావు, పొన్నాడ సూర్యారావు, మామిడిశెట్టి శ్రీనివాసరావు, నీతిపూడి సత్యనారాయణ, ఉపాధ్యాయుల లక్ష్మీనారాయణ, సత్తిరాజు వెంకటేశ్వరరావు, స్వామి తదితరులు అభినందనలు తెలిపారు.



నూతనంగా ఎన్నికైన రాజోలు న్యాయవాద సంఘ కార్యవర్గం